# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రానికి 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు గ్రీన్ ఎనర్జీ రూపంలో రానున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- కుర్నూల్ లో గ్రీన్ కో ప్రాజెక్టు కోసం మరో 10 వేల కోట్లు రూపాయలు ఖర్చు చేయనున్నామని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు.
- గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను త్వరలో పునర్ వ్యవస్థీకరిస్తామని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు.
- స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలను రాష్ట్రంలో పలు జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో ఈ రోజు ఘనంగా నిర్వహించారు.

================================

రాష్ట్రానికి 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు గ్రీన్ ఎనర్జీ రూపంలో రానున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... అనకాపల్లి జిల్లా పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ తయారవుతుందని, మిగిలిన ప్రాంతాల్లో తయారయ్యే సౌర, పవన, పంపడ్ స్టోరేజ్ విద్యుత్ ను పూడిమాడకకు తెచ్చి వాటి ద్వారా హైడ్రోజన్ ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. ఉత్పత్తయ్యే హైడ్రోజన్ తో ఎరువులు, రసాయనాలు తయారవుతాయని, హరిత ఇంధనం ద్వారా తయారయ్యే వీటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని వివరించారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రస్తుతం సౌర ఫలకాలను ఉచితంగా ఏర్పాటు చేస్తుండగా, మిగిలిన వారికి కూడా సౌర ఫలకాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ రాయితీ పోను మిగిలిన ఫలకాలను రాష్ట్ర ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని స్పష్టం చేశారు.

================================

కుర్నూల్ లో గ్రీన్ కో ప్రాజెక్టు కోసం ఇప్పటికి 12 వేల కోట్లు రూపాయలు ఖర్చు చేయగా, మరో 10 వేల కోట్లు రూపాయలు ఖర్చు చేయనున్నామని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ రోజు ఆయన కర్నూలు జిల్లాలోని గ్రీన్ కో ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఈ

ప్రాజెక్టుకు సంబంధించి 45 హెక్టార్ల భూమి రెవెన్యూ, అటవీశాఖల మధ్య వివాదంలో ఉందని, దాన్ని పరిష్కరించేందుకే తాను వచ్చానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మూడో వంతు విద్యుత్ అవసరాలను ఈ ప్రాజెక్ట్ అందిస్తుందని పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

==================================

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను త్వరలో పునర్ వ్యవస్థీకరిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. సచివాలయ మార్పులు ఉంటాయని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==================================

వడ్డె ఓబన్న జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు అధికారికంగా జరుపుతోంది. ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి వడ్డె ఓబన్న సన్నిహితుడుగా ఉన్నారు. నల్లమల కేంద్రంగా గెరిల్లా పద్ధతుల్లో బ్రిటీష్ వారిపై ఆయన పోరాటం చేసి 39 సంవత్సరాలకే అసువులు బాసారు. వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా సామాజిక మాధ్యమ వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రేనాటి వీరుడు ఓబన్న చరిత్ర నేటి తరాలకు తెలపాలని కోరారు.

==================================

శ్రీకాకుళం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న సమీకృత కలెక్టర్ కార్యాలయ భవన సముదాయాన్ని జిల్లా రెవిన్యూ అధికారి రహదారులు, భవనాలశాఖ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఈ రోజు నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు నిర్వహించిన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... నాణ్యతలో రాజీ లేకుండా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

విరామం

==================================

సంక్రాంతి పండుగ రద్దీ నేపథ్యంలో ప్రయాణికులను పట్టణాల నుంచి పల్లెలకు పంపేందుకు వీలుగా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు, రవాణా శాఖ అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఫిట్‌నెస్ ఉన్న బస్సులను ఎంపిక చేసి వాటి ద్వారా ప్రజలను క్షేమంగా గమ్యస్థానాలకు పంపే ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆర్టీసీ, రవాణా, పోలీసు శాఖ అధికారులతో సంస్థ ఎండీ ద్వారకా తిరుమల రావు చర్చించారు. బస్టాండ్లలో రద్దీ నివారణా చర్యలపై అధికారులకు సూచనలు చేశారు.

==================================

అసంఘటిత రంగంలో ఉన్న భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇ-శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించిందని తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి కార్మిక శాఖ అధికారి జి.రంగనాథ్ తెలిపారు. తిరుపతిలో ఆకాశవాణితో ఆయన ఈరోజు మాట్లాడుతూ.. అసంఘటిత రంగంలో పని చేస్తున్న వారి సమాచారం సేకరించి, కేంద్రప్రభుత్వ పథకాల

ఫలాలను వారికి అందించాలనేది ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. అసంఘటిత రంగ కార్మికులు eshram.gov.in వెబ్ సైట్ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

================================

స్వయం ఉపాధిలో ఉంటూ, మూడు చక్రాల వాహనం కలిగి ఉన్న దివ్యాంగుల నుండి పెట్రోల్ రాయితీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని అనంతపురం జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వినోద్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 21వ తేదీలోపు దరఖాస్తులను అందజేయాలని, దరఖాస్తుతో పాటు సదరం సర్టిఫికెట్, పెట్రోల్ బిల్లులు, బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, మూడు చక్రాల వాహనం యొక్క డ్రైవింగ్ లైసెన్స్, ఇతర పత్రాలను కార్యాలయంలో సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 08554- 232380ను సంప్రదించాలని ప్రకటనలో సూచించారు.

================================

స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలను రాష్ట్రంలో పలు జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో ఈ రోజు ఘనంగా నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వడ్డె ఓబన్న జయంతి ప్రభుత్వం కార్యక్రమంగా జరుపుకోవడం సంతోషకరమని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ అన్నారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కలెక్టర్ కార్యాలయంలో వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు.

================================

కాఫీ పండ్ల సేకరణ లక్ష్యాలు సాధించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ స్పష్టం చేశారు. ఈ రోజు ఐటీడీఏ కార్యాలయంలో అరకు నియోజక వర్గం మండలాల కాఫీ ఏఈవోలు, ఫీల్డ్ కన్సల్టెంట్లు, హార్టికల్చర్ కన్సల్టెంట్లతో కాఫీ పండ్ల సేకరణపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 20వ తేదీ నాటికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని, లక్ష్యాలు సాధించిన సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని చెప్పారు. 50 శాతం లక్ష్యాలు సాధించిన సిబ్బందిని మాత్రమే కొనసాగిస్తామని పేర్కొన్నారు.

================================

వైకుంఠ ద్వాదశిని పురస్కరించుకొని తిరుమలలో చక్రస్నాన మహోత్సవం ఈ రోజు వైభవంగా నిర్వహించారు. పాలు, పెరుగు, చందనం, వివిధ సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం కార్యక్రమం చేపట్టారు. అనంతరం తులసి మాలను ధరింపజేసి శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్‌కు శాస్త్రోక్తంగా పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు.

================================

తెలుగు ప్రజలందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరిలో సంక్రాంతి కొత్త వెలుగులు, ఆనందం నింపాలని ఆకాంక్షించారు.

================================
================================